సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



మారికను వదులుకోం..

ఎవరి కోసమో ఇళ్లు, భూములు వదులుకోవా ల్సిన అవసరం లేదని వేపాడ మండలంలోని మారిక గ్రామస్తులు స్పష్టం చేశారు. - 8లో



పోటెత్తిన అర్జీదారులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. - 8లో



కన్నవారిని కడతేర్చిన కసాయి అరెస్ట్

ఆస్తి కోసం జన్మనిచ్చిన తల్లిదండ్రులనే కాటికి పంపించాడో కసాయి కొడుకు. తోడబుట్టిన చెల్లికి ఆస్తిలో వాటా ఇచ్చారన్న అక్కసుతో కన్న వారిని ట్రాక్టర్‌తో తొక్కి చంపాడు. - 8లో

న్యూస్‌రీల్

చెక్‌డ్యామ్ స్థల పరిశీలన



వనకబడి గెడ్డ వద్ద ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

కొమరాడ: మండలంలోని చినఖేర్జిల పంచాయతీ బట్టమాగువలస గ్రామంలోని వనకబడి గెడ్డ వాగుపై నిర్మించనున్న చెక్ డ్యామ్ స్థలాన్ని కలెక్టర్ ఏ.శ్యామప్రసాద్ సోమవారం పరిశీలించారు. బోయిలబండ, కనపల, పెద్ద చెరువులను అనుసంధానించే ప్రతిపాదిత చెక్ డ్యామ్‌తో కూడిన లింకేజీ వ్యవస్థపై నీటిపారుదల ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాగునీటి వనరుల అనుసంధానంతో సుమారు 410 ఎకరాలకు ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం నీటి పారుదల శాఖ డివిజనల్ కార్య నిర్వాహక ఇంజినీర్ ఆర్.అప్పలనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, అధికారులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత



విజయనగరం ఎంపీడీఓకు నియామక పత్రాన్ని అందజేస్తున్న జెడ్పీ చైర్మన్, జెడ్పీ సీఈఓ

విజయనగరం రూరల్: మండల పరిషత్ కార్యాలయాల్లో పరిపాలన అధికారులు, పంచాయతీ విస్తరణ అధికారులుగా విధులు నిర్వహిస్తూ, ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తన చాంబర్‌లో సోమవారం నియామక పత్రాలు అందజేశారు. విజయనగరం మండల పరిపాలనాధికారిగా పనిచేస్తున్న జి.వెంకటరావుకు ఇదే మండలంలో ఎంపీడీఓగా నియమించారు. సీతానగరం మండల పరిషత్ ఏవోగా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ పాచిపెంట ఎంపీడీఓగా, గుమ్మ లక్ష్మీపురం విస్తరణ అధికారి కె.ధర్మారావు జియ్యమ్మవలస ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగాల నుంచి తొలగిస్తే.... ఆత్మహత్యలే శరణ్యం

- ఏపీఈపీడీసీఎల్ అధికారుల ఎదుట షిఫ్ట్ ఆపరేటర్ల ఆత్మహత్యాయత్నం
- రాజకీయ కక్షతో వేధింపులు తగవు
- పుర్రేయవలస సబ్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత

చీపురుపల్లి: ఏడాదిగా విధులు నిర్వహిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లను తొలగిస్తే ఊరుకునేది లేదు.. ఉద్యోగాలు వస్తాయనే సబ్‌స్టేషన్‌కు భూమిలిచ్చాం.. ఉద్యోగాల నుంచి తొలగించాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నదెవరో ఇక్కడకు రమ్మని చెప్పండి.. విధుల నుంచి తొలగిస్తే ఆత్మహత్యలే శరణ్యమంటూ మండలంలోని పుర్రేయవలస గ్రామ పరిసరాల్లోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో పని చేస్తున్న నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఆపరేటర్లను తొలగించేందుకు వచ్చిన ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ రమణ, ఏఈ ప్రభాకర్‌లను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, పార్టీ మండలాధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు నిలదీశారు. ఇంతలో షిఫ్ట్ ఆపరేటర్లు మీసాల బాలాజీ, సమిసెట్టి సురేష్‌కుమార్, రెడ్డి సతీష్, పల్లి సూర్యనారాయణలు పురుగు మందు డబ్బాలు తీసి ఆత్మహత్యకు సిద్ధంకావడంతో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలొంది. సాయిమణికంట ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అనే సంస్థ ఆధ్వర్యంలో ఏపీఈపీడీసీఎల్ అధికారులు కాంట్రాక్టు పద్ధతిలో నియమించారని, ఇప్పుడు తొలగిస్తామంటే చావుతప్ప మరో మార్గంలేదన్నారు. వేతన సమస్య కూడా కార్మికశాఖ అధికారుల సమక్షంలో పరిష్కారమైందన్నారు. ఏడాదిగా ఈపీఎఫ్ కూడా చెల్లిస్తున్నట్టు వెల్లడించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లామని ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

• పిడుగుల వాన



జలమయమైన పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్



సీతానగరంలో ఈదురుగాలులతో కురుస్తున్న వర్షం



పిడుగుపాటుకు దెబ్బతిన్న బలిజిపేట వేంకటేశ్వరస్వామి ఆలయం ధ్వజస్తంభం దిమ్మ

పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. చెట్లు నేలకూలాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పిడుగుపాటుకు బలిజిపేట వేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభం దిమ్మ బీటలువారి పెచ్చులూడిపోయింది. సీతానగరం మండల కేంద్రంలోని సచివాలయం ఆవరణలో చెట్టు పడిపోయింది. తామరఖండి, గెడ్డలుప్పి, మరిపివలస, దయానిధిపురం, ఏగోటివలస గ్రామాల సమీపంలో విద్యుత్ తీగెలపై చెట్ల కొమ్మలు పడిపోవడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. నువ్వు, మొక్కజొన్న, జీడిమామిడి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. – బలిజిపేట/సీతానగరం/సీతంపేట

• పిడుగు పడి వ్యక్తి మృతి


భామిని: భామిని మండలం ఘనసరకు చెందిన పాలపర్తి సిమ్మన్న(62) సోమవారం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. కొత్తగూడ నుంచి మాసగూడకు వంశధార గట్టుమీదుగా వస్తుండగా పిడుగు పడడంతో దుర్మరణం చెందాడు. మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.



మృతి చెందిన సిమ్మన్న

• పాచిపెంటలో వడగళ్ల వాన

పాచిపెంట: మండలంలోని గొట్టూరు పంచాయతీ కన్నయ్యవలస సమీప గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారి చల్లబడడంతో వేసవి తాపం నుంచి కొంత ఉపశమనం లభించిందని స్థానికులు పేర్కొన్నారు.



కన్నయ్యవలస సమీపంలో కురిసిన వడగళ్లు



సీతంపేటలో కురుస్తున్న వర్షం

పాలకొండలో నీచ రాజకీయం!

- నగర పంచాయతీ చైర్‌పర్సన్‌గా ఆకుల మల్లీశ్వరి ఎన్నిక
- వైఎస్సార్‌సీపీ బీ ఫారంతో నామినేషన్ దాఖలు
- స్వతంత్ర అభ్యర్థిగా ఉంటానంటూ ప్రకటన
- నిబంధనలు మార్పుతో కోరం లేకుండా ఎన్నిక పూర్తి
- చైర్‌పర్సన్ అభ్యర్థి తమ పార్టీయే అంటూ కండువాలు కప్పిన టీడీపీ నాయకులు
- విస్తుపోయిన జనం



చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహిస్తున్న జేసీ శోభిక

పాలకొండ:

పాలకొండ పంచాయతీ కార్యాలయం సాక్షిగా కూటమి నాయకులు విలువలకు తిలోదకాలిచ్చి, నీచరాజకీయాలకు తెరతీస్తూ సోమవారం నిర్వహించిన చైర్‌పర్సన్ ఎన్నికలోరాజకీయ నాటకాన్ని రక్తి కట్టించారు. దీనిని చూసిన జనం విస్తుపోయారు. సంఖ్యాబలం లేకుండా.. వైఎస్సార్‌సీపీ బీఫారంతో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఆకుల మల్లీశ్వరికి టీడీపీ కండువాలు కప్పి తమ పార్టీయే అంటూ హంగామా చేయడాన్ని చూసిన జనం నవ్వుకున్నారు. కూటమి నాయకులు చేసిన పలు మంత్రాలు, తంత్రాలు, నాటకాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

ఇదీ లెక్క..

పాలకొండ నగర పంచాయతీలో 20 వార్డులు ఉండగా వైఎస్సార్‌సీపీ నుంచి 17 మంది కౌన్సిలర్లు ఉన్నారు. టీడీపీకి ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. నగరపంచాయతీ చైర్మన్ పదవి ఎస్సీలకు రిజర్వు కావడంతో 19వ వార్డు కౌన్సిలర్ యందవ రాధాకుమారిని అప్పటి వైఎస్సార్ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ఆరు నెలల కిందట రాధా కుమారి వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్ చైర్మన్–2గా ఉన్న పల్లా ప్రతాప్‌కు చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. చైర్‌పర్సన్ ఎన్నికకు మూడునెలల కిందట నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఒకే ఒక్క సభ్యురాలు ఆకుల మల్లీశ్వరిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకోవడం తప్పనిసరైంది. వైఎస్సార్‌సీపీకి సభ్యుల బలం ఉండడంతో పాటు, ఆకుల మల్లీశ్వరి కూడా వైఎస్సార్‌సీపీకి చెందినవారే కావడంతో చైర్‌పర్సన్ ఎన్నిక లాంచనే అనున్నారు. ఇంతలో ఆమెను టీడీపీలో చేర్చుకుని, చైర్‌పర్సన్ పదవి కూటమిదేనని చెప్పుకునేందుకు నాయకులు ప్రలోభాలకు తెరతీశారు. కౌన్సిలర్లపై ఒత్తిడి పెంచారు. ఏకంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లాకు చెందిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సైతం ఇందులో పాత్రదారులయ్యారు. సాంకేతికంగా మల్లీశ్వరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికావడం, పార్టీ నుంచి ఎన్నికకు బీ–ఫారం అందించడంతో కూటమి ఎత్తులు పారలేదు. మూడు మార్లు ఎన్నిక వాయిదా పడింది.

నిబంధనలు మార్పు చేసి....

కూటమి అధికార బలంతో చివరకు ఎన్నిక పూర్తి చేశారు. నిబంధనలు మార్పు చేసి సభ్యుల ప్రమేయం లేకుండా నేరుగా మల్లీశ్వరిని చైర్మన్‌గా ఎన్నిక చేసేందుకు తమ అధికార బలం ఉపయోగించారు. ఎన్నికల అధికారిగా ఉన్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డిని తప్పించి ఎన్నికల అధికారిగా జేసీ శోభికను నియమించారు. ఉదయం 11 గంటలకు ఎన్నికల గదిలో ఆకుల మల్లీశ్వరి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. దీనికి టీడీపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. కొత్తగా మార్చిన ముగ్గురు సభ్యుల మద్దతు ఉంటే చాలన్న నిబంధన మేరకు ఆకుల మల్లీశ్వరి చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్టు జేసీ ప్రకటించారు. ఎన్నికల కేంద్రం నుంచి బయటకు వచ్చిన వెంటనే ఆమెకు టీడీపీ కండువాలను వేసి పదవి తమకే వచ్చిందంటూ కూటమి నాయకులు ప్రకటించారు. దీనికోసం మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, కిడారి శ్రవణ్‌ల ఉదయం నుంచి ఎన్నికల కార్యాలయం వద్ద మంతనాలు జరపడం గమనార్హం. చైర్‌పర్సన్ ఎన్నికలో వైఎస్సార్‌సీపీకి చెందిన 14 మంది కౌన్సిలర్లు దూరంగా ఉండగా, కేవలం ఐదుగురు సభ్యులతో ఎన్నిక పూర్తి చేశారు. ఎన్నికల అనంతరం జేసీ శోభికతో విలేకరులు మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆమె అక్కడ నుంచి మాట్లాడకుండా వెళ్లిపోయారు.

అధికార బలంతో అడ్డదారులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విక్రాంత్, కళావతి, కౌన్సిలర్లు

- కూటమి నాయకులు ప్రజాసామ్యన్ని ఖూనీ చేశారు
- నైతిక విజయం ఎవరిదో ప్రజలకు తెలుసు
- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం కూటమి నాయకులు అడ్డదారులు తొక్కారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిలు ధ్వజమెత్తారు. కౌన్సిలర్లతో కలిసి పాలకొండ పట్టణంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ బీ–ఫారంపై గెలిచిన ఆకుల మల్లీశ్వరిని చైర్మన్‌గా ఎన్నుకుని కూటమి నాయకులు తాము గెలిచినట్లు ఆర్భాటం చేస్తున్నారని విమర్శించారు. కనీస సభ్యులు బలం లేకుండా కేవలం అధికారం ఉందన్న ఒకే ఒక్క అహంకారంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నగర పంచాయతీలో 17 మంది కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీవారే అన్న విషయాన్ని మర్చిపోవద్ద గుర్తు చేశారు. 2వ వార్డుకు చెందిన ఆకుల మల్లీశ్వరిని ప్రలోభపెట్టి, భయపెట్టి పార్టీ కండువా వేశారన్నారు. వైఎస్సార్‌సీపీ బీఫారం ఇస్తే టీడీపీ అభ్యర్థి ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఈ ఎన్నికలో వైఎస్సార్ సీపీదే నైతిక విజయమన్నారు. తాము ఎప్పటికీ పట్టణం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కౌన్సిల్‌లో తమ పార్టీ అభ్యర్థులు పూర్తిస్థాయి మెజారిటీతో ఉన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అప్పుకిందే రూ. 2కోట్లు

- పండగ కోసం ప్రత్యేక గ్రాంటు కాదు..
- స్పష్టం చేసిన మున్సిపల్ అధికారులు
- శ్యామలాంబ పండగ పనులకు కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం



మున్సిపాలిటీలో రూ.2 కోట్ల నిధులపై అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

సాలూరు:

పట్టణంలో శ్యామలాంబ పండగ నిర్వహణ కోసం మున్సిపాలిటీ నుంచి ఖర్చు చేస్తున్న 2 కోట్ల రూపాయలు ప్రభుత్వ గ్రాంటు కాదని, మున్సిపాలిటీలకు అప్పు రూపేణా మంజూరైన నిధులని అధికారులు స్పష్టంచేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన కమిషనర్ కృష్ణారావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మున్సిపల్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ముందుగా మున్సిపాలిటీకి రూ.2కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులపై స్పష్టత ఇవ్వాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరిరఘు, రాపాక మాధవరావు, బి. శ్రీనివాసరావు తదితరులు అధికారులను ప్రశ్నించారు. దీనిపై మున్సిపల్ డీఈ ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 40 మున్సిపాలిటీలకు నిధులు మంజూరయ్యాయని, అందులో సాలూరు మున్సిపాలిటిటీ రూ.2 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. ఇది అప్పు కింద మంజూరు చేశారని, మున్సిపాలిటీలో నిధులు ఉన్నప్పుడు తిరిగి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కౌన్సిలర్లుకు తెలపకుండా పైలెట్ వాటర్‌స్కీమ్‌లు మంజూరుపై అధికారులను పలువురు నిలదీశారు. 25వ వార్డులో ఉన్న తాగు నీటి పథకాలను రూ.2లక్షలతో మరమ్మతులు చేపడితే సమస్య పరిష్కారమయేదన్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడంపై కౌన్సిలర్ పాండ్రంకి సన్యాసమ్మ నిలదీశారు. పట్టణంలో వైభవ్ జ్యూయలర్స్ అనుమతులపై కౌన్సిలర్లు ప్రశ్నించారు. శ్యామలాంబ పండగ నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తీర్మానించారు. పలు అభివృద్ధి పనులపై చర్చించి, అజెండాలోని పలు అంశాలకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కదం తొక్కిన సీహెచ్ఓలు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

- సర్వీసు క్రమబద్ధీకరించాలని డిమాండ్
- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా వేతనం చెల్లించాలి
- కలెక్టరేట్ ఆవరణలో నిరసన



కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీహెచ్‌డబ్ల్యూఓలు

పార్వతీపురంటౌన్:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి అన్నివర్గాల వారికి అన్యాయం చేయడం తప్ప ఏ ఒక్కరికీ న్యాయం చేసిన దాఖలాలు లేవు. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, 108, 104 ఉద్యోగులు, ఉపాధిహామీ మేట్లు ఇలా.. తమకు న్యాయం చేయాలంటూ గడచిన పదినెలల్లో ధర్నాలు, ఆందోళనలతో ప్రభుత్వ తీరుపై నిరసన తెలుపుతున్నారు. తాజాగా తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని, పనికి తగిన ప్రోత్సాహకాలు అందజేయాలని, ఎన్‌హెచ్ ఎంలతో సమానంతో వేతనం చెల్లించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగదీష్ కుమార్ మాట్లాడుతూ వేతనాలను తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. వీరికి ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిశోర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్, సెక్రటరీ ఇంద్రాణి, కోశాధికారి రాజేశ్వరి, టి.జాకబ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలి. వేతనాలు చాలక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనం పెంచాలి. ప్రభుత్వం మా సమస్యలను గుర్తించాలి.

– ఎస్.రాజేశ్వరీ, సీహెచ్ఓ, నర్సిపురం

ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు విధి నిర్వహణలో భాగంగా ఎఫ్ఆర్ఎస్‌తో ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి. న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలి.

– ఎస్. శిరీష, సీహెచ్ఓ, గొట్టివలస

చాలీచాలని వేతనం



కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల వేతనాల్లో ఎటువంటి పురోగతి లేదు. కొత్తగా ఎఫ్ఆర్ఎస్‌ను ప్రారంభించారు. వైద్య సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్‌లో మినహాయింపు ఉండాలి. ప్రభుత్వం వీటిపై దృష్టిసారించడమే కాకుండా ఏటా 5 శాతం ఇంక్రిమెంటు అమలు చేయాలి. సమస్యలు పరిష్కరించనట్లెతై భవిష్యత్‌లో ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తాం.

– ఇంద్రాణి, సీహెచ్ఓ, ఆర్దీ వలస

చెరువుల పరిరక్షణే ప్రధానం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలోని చెరువులు ఆక్రమణకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ నిధులతో చెరువులను అభివృద్ధి చేస్తామన్నారు. రెవెన్యూ, పోలీస్, సర్వే అధికారులు సంయుక్తంగా చెరువుల సరిహద్దులు గుర్తించాలని స్పష్టం చేశారు. చెరువులు, చెక్‌డ్యాం పనులు మంగళవారం నుంచి ప్రారంభించారు. జిల్లాలో వీలైనన్ని నీటి కుంటలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి వి. వీర్రాజు, జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్‌పాల్, పశుసంవర్ధక శాఖాధికారి ఎస్.మన్మథరావు, ఉద్యానశాఖాధికారి శ్యామల, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో ఐదు కేటగిరీల్లో ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరచినట్టు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ జాబితాలో అభ్యంతరాలుంటే ఈ నెల 29, మే 3, 5, 6 తేదీల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలలోగా తెలియజేయాలన్నారు.

క్లుప్తంగా

సృజన శ్రీకర్‌కు గిన్నిస్‌బుక్‌లో స్థానం



గిన్నిస్‌బుక్‌లో స్థానం దక్కించుకున్న విద్యార్థి సృజనశ్రీకర్

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి పట్టణానికి చెందిన ఐదో తరగతి విద్యార్థి ధర్మవరపు సృజనశ్రీకర్ గిన్నిస్ బుక్‌లో స్థానం దక్కించుకున్నాడు. విజయవాడకు చెందిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు పాస్టర్ అగస్టీన్ దండంగి ఆధ్వర్యంలో డిసెంబర్ 1న 18 దేశాలకు చెందిన 1090 మంది విద్యార్థులు 60 నిమిషాలలో అందరూ ఏకకాలంలో కీబోర్డు ప్లే చేసి ఇన్‌స్టాగామ్‌లో అప్‌లోడ్ చేశారు. వీరిలో 1046 మంది విద్యార్థులు గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. వీరిలో గరివిడి పట్టణంలోని ఈహెచ్ కాలనీకి చెందిన పాస్టర్ ధర్మవరపు ప్రసాదరావు, వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు సృజనశ్రీకర్ కూడా ఉన్నాడు. ఈ నెల 25న విజయవాడలోని మెట్రోపాలిటన్ మిషన్ చర్చిలో సృజనశ్రీకర్ ప్రశంసాపత్రం అందుకున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

కబ్జాదారుడిపై చర్యలు తీసుకోండి..

- కలెక్టర్‌కు చీపురుపల్లి రైతుల వినతి


ఫిర్యాదుపత్రాలతో చీపురుపల్లి రైతులు

విజయనగరం అర్బన్: చీపురుపల్లి రెవెన్యూ పరిధిలోని రైతులు, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న జనసేన నాయకుడు విసినిగిరి శ్రీనుపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను సోమవారం కలసి వినతిపత్రం అందజేశారు. విసినిగిరి శ్రీను చేసిన భూ కబ్జాలపై తహసీల్దార్, ఆర్డీఓ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చీపురుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల దగ్గర గెడ్డ పోరంబోకు భూమిని ఆక్రమించి విక్రయించాడని ఆరోపించారు. అలాగే చీపురుపల్లి - రాజాం మార్గంలోని ఆర్అండ్‌బీ రోడ్డుని ఆనుకుని సుమారు రెండెకరాల ఉమా రామలింగేశ్వరస్వామి దేవస్థానం భూమిని ఆక్రమించి దానిని ప్లాట్లుగా విక్రయించాడని చెప్పారు. ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కొసిరెడ్డి రమణ, గవిడి సురేష్, రెడ్డి గోపి, కరణం ఆదినారాయణ, డబ్బాడ ఆనంద్, పండు, సత్యం, వెంకీ, తదితరులు ఉన్నారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం


నిందితులతో ఎస్.కోట సీఐ, సిబ్బంది

శృంగవరపుకోట: అక్రమంగా తరలిస్తున్న ఆరు కిలోల గంజాయిని ఎస్.కోట పోలీసులు సోమవారం మధ్యాహ్నం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్.కోట పోలీసులు పందిరప్పన్న జంక్షన్‌లో వాహన తనిఖీలు చేపడుతుండగా.. మోటార్ సైకిల్‌పై వస్తున్న ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా..వారి వద్ద ఆరు కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ వి. నారాయణమూర్తి తెలిపారు.

మారికను వదులుకోం..

- అదానీ కోసం ఇళ్లు, భూములు కోల్పోవాల్సిన అవసరం లేదు
- తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనుల ఆందోళన
- వంటావార్పుతో నిరసన


తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు, గిరిజన సంఘ నాయకుల ఆందోళన

వేపాడ: ఎవరి కోసమే ఇళ్లు, భూములు వదులుకోవాల్సిన అవసరం లేదని మండలంలోని మారిక గ్రామస్తులు స్పష్టం చేశారు. గ్రామ పరిసరాల్లో ఏర్పాటు చేయనున్న హైడ్రో పవర్‌ప్లాంట్ మాకొద్దంటూ మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు పలు సంఘాల మద్దతుతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అదానీ గో బ్యాక్.. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి నశించాలి.. గిరిజన కుటుంబాలకు న్యాయం చేయాలి.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడుతూ.. గిరిశిఖరంపై ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులకు అన్యాయం చేయడం తగదన్నారు. గుజరాత్‌కు చెందిన ప్రైవేట్ హైడ్రోపవర్ ప్లాంట్ కోసం గ్రామాన్ని, జిరాయితీ పొలాలను వదిలి వెళ్లిపొమ్మనడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. గ్రామానికి రోడ్డు వేస్తుంటే గ్రామస్తులు ఎంతో సంతోషించారని.. అయితే అదానీ గ్రూప్ కోసం రోడ్డు వేశారన్న విషయం గ్రామస్తులు పసిగట్టలేకపోయారని చెప్పారు. మారికలో 35 సర్వే నంబర్లు ఉంటే 1 నుంచి 32 సర్వే నంబర్లలోని సుమారు 213 ఎకరాల భూములు, ఇళ్లు, బడి, గుడిని అదానీకి రాసేయడం దారుణమన్నారు. భూముల జీఓ రద్దు చేసే వరకూ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఇక్కడే వంటా వార్పు చేపట్టి నిరసన చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, ఏపీ రైతుసంఘ జిల్లా కార్యదర్శి రాంబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్ది రమణ, పాల రైతుల సంఘ జిల్లా కార్యదర్శి గొంప కృష్ణమూర్తి, వ్యవసాయకార్మిక సంఘ నాయకుడు గాడి అప్పారావు, సీపీఎం నేతలు శ్యామ్, పాతమారిక, కొత్తమారిక గిరిజనులు పాల్గొన్నారు.


వంటావార్పులో భాగంగా నిరసన చేపడుతున్న గిరిజనులు

గిరిజనులకు అండగా ఉంటాం..


గిరిజనుల న్యాయ పోరాటానికి అండగా ఉంటాం. మారిక గ్రామాన్ని అదానీకి రాసి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నాం. గిరిజనుల పోరాటానికి పూర్తి స్థాయిలో మద్దతిస్తాం. తక్షణమే జీఓను వెనక్కితీసుకుని గిరిజనులకు న్యాయం చేయాలి.

– రాంబాబు, ఏపీ రైతుసంఘ రాష్ట్ర కార్యదర్శి

కార్పొరేట్ శక్తుల సేవలో పెద్దలు..


ప్రధాని మోదీ, తదితరులు కార్పొరేట్ శక్తుల సేవలో బిజీగా ఉన్నారు. పేద ప్రజలపై కనీసం దృష్టి సారించకపోవడం బాధాకరం. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడం న్యాయం కాదు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్య సదుపాయాలు కల్పించాల్సింది పోయి వారి భూములు లాక్కోవడం ఎంతవరకు సమంజసం. గిరిజనులకు అండగా చివరి వరకు పోరాడుతాం.

– తమ్మినేని సూర్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి, విజయనగరం

పోరాటం ఆపేది లేదు..


భూములు కేటాయిస్తూ ఇచ్చిన జీఓ రద్దు చేసే వరకూ పోరాటం కొనసాగిస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ మారిక గ్రామాన్ని వదులుకోం. పోడు వ్యవసాయం చేసుకుని కాలం వెళ్లదీస్తున్న గిరిజనులకు అన్యాయం చేయాలనుకోవడం మంచి పద్ధతి కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సామన్యులకు అండగా నిలవాలే తప్ప కార్పొరేట్ శక్తులకు కాదు.

– పాతబోయిన పెంటమ్మ, సర్పంచ్, కరకవలస పంచాయతీ, మారిక గ్రామం

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కరించండి

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి


ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన స్టేషన్ అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీచేస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం రూరల్: ప్రజలు తెలియజేసిన సమస్యలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ కలహాలు, వేధింపులు, భూ, ఆస్తి వివాదాలు, సైబర్ మోసాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీల వసూళ్లు, ప్రేమ పేరుతో మోసాలపై అర్జీలు వచ్చాయి. అనంతరం వివిధ స్టేషన్ల సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

39 అర్జీల స్వీకరణ...

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందల్, తదితరులు 39 అర్జీలు స్వీకరించారు. బాధితులతో ముఖాముఖి మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో వీడియో కాల్ ద్వారా మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల వాస్తవ నివేదికలను తన కార్యాలయానికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ఎస్‌బీ సీఐలు లీలారావు, చౌదరి, డీసీఆర్‌బీ ఎస్సై రాజేష్, పీఆర్‌ఓ కోటేశ్వరరావు, సిబ్బంది కిషోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఫిర్యాదుదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

ఘోషా ఆస్పత్రి సిబ్బందికి ఎక్సలెన్స్ అవార్డు


ఘోషా ఆస్పత్రి కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌కు అవార్డు అందజేస్తున్న ప్రిన్సిపాల్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: ఘోషా ఆస్పత్రి పీపీటీసీటీ సిబ్బందికి సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. హెచ్ఐవీ రోగులకు నిరంతరం అందిస్తున్న సేవలను గుర్తించి నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ రాష్ట్రంలోని కొన్ని ఆస్పత్రులను గుర్తించి సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు ఇచ్చారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఘోషా ఆస్పత్రి పీపీటీసీటీ సిబ్బందికి కూడా అవార్డు ప్రకటించారు. దీంతో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె. పద్మలీల, ఆస్పత్రి సూపరింటిండెంట్ అప్పలనాయుడు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి కె.రాణి పీపీటీసీటీ కౌన్సిలర్లు ఈ.పద్మావతి, టి. గోపాలరావు, ల్యాబ్ టెక్నీషియన్ గౌరీశంకర్‌లకు సోమవారం అవార్డు అందజేశారు.

కన్నవారిని కడతేర్చిన కసాయి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, వెనుక ముసుగులో నిందితుడు

విజయనగరం క్రైమ్: ఆస్తి కోసం జన్మనిచ్చిన తల్లిదండ్రులనే కాటికి పంపించాడో కసాయి కొడుకు. తోడబుట్టిన చెల్లికి ఆస్తిలో వాటా ఇచ్చారన్న అక్కసుతో కన్నవారిని ట్రాక్టర్‌తో తొక్కి చంపాడు. ఈ సంఘటన ఈ నెల 26న పూసపాటిరేగ మండలం రెల్లివలసలో చోటుచేసుకోగా.. నిందితుడ్ని సోమవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. రెల్లివలసకు చెందిన పాండ్రంకి అప్పలనాయుడు, జయమ్మ దంపతులకు రాజశేఖర్, రాధాకుమారి సంతానం. కూతురు రాధను ఆనందపురం మండలం నెలతేరు గ్రామానికి చెందిన వ్యక్తితో పెళ్లి చేసి 30 సెంట్ల భూమిని పసుపు,కుంకుమ కింద ఇచ్చారు. కుమారుడు రాజశేఖర్ భార్యాబిడ్డలతో రెల్లివలసలోనే వేరేగా ఉంటున్నాడు. అతనికి రూ. 12 లక్షలు అప్పు ఉండడంతో 70 సెంట్ల భూమిని తనకు ఇవ్వాలని తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు గొడవ పడేవాడు. ఇటీవల రైతుభరోసా కోసం రాజశేఖర్ దరఖాస్తు చేయగా.. తండ్రి పేరుమీద 40 సెంట్ల భూమి.. సోదరి రాధ పేరుమీద 30 సెంట్ల భూమి ఉన్నట్లు తెలుసుకున్నాడు. వెంటనే గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా తేలకపోవడంతో.. ఈ నెల 26న సోదరి పేరుమీదున్న భూమిని చదును చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ సమయంలో అడ్డుకోవడానికి వచ్చిన తల్లిదండ్రులను ట్రాక్టర్‌తో తొక్కి చంపాడు. సోదరి రాధ ఫిర్యాదు మేరకు ఎస్సై దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి... సోమవారం నిందితుడ్ని అరెస్ట్ చేశారు.

పోటెత్తిన అర్జీదారులు

- కిటకిటలాడిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- పెన్షన్ కోసం వచ్చిన వారే అధికం
- గడువులోగా వినతులకు పరిష్కారం : కలెక్టర్ అంబేడ్కర్


వినతులు పరిశీలిస్తున్న లెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. పెన్షన్ మంజూరు కోసమే ఎక్కువ మంది రావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. మొత్తం 188 వినతులు రాగా అందులో 30 వరకు పెన్షన్లకు సంబంధించినవి కావడం విశేషం. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ.. వచ్చే వినతులను సంబంధిత లాగిన్‌లో అధికారులు పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అలాగే రీ ఓపెన్ కేసులపై విచారణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు జేసీ సేతు మాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీలతో కలిసి వినతులు స్వీకరించారు. మొత్తం 188 అర్జీలు అందగా భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ శాఖకు అత్యధికంగా 80 వినతులు అందాయి. పంచాయతీరాజ్ శాఖకు 15.. ఫింఛన్లు మంజూరు చేయాలని, తదితర అంశాలపై డీఆర్‌డీఏకు 30.. మున్సిపాలిటీకి 07.. జీఎస్‌డబ్ల్యూకు 06.. విద్యాశాఖకు 05.. హౌసింగ్‌కు 02 .. విద్యుత్ శాఖకు 02.. వైద్యశాఖకు ఒకటి.. మిగిలినవి ఇతర శాఖలకు సంబంధించినవి.

సమయ పాలన పాటించాలి..

ప్రభుత్వ కార్యాలయాలకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. చాలా మంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రతిరోజూ ఉదయం 10.45 గంటలకు అన్ని కార్యాలయాల హాజరు పట్టీని ఫొటో తీసి డీఆర్‌ఓకు పంపించాలని ఆదేశించారు. అలాగే వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో 88 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ, రీసర్వే, భూ వివాదాలు, ఉపాధి అవకాశాలు పౌరసరఫరా సేవలు, గృహపట్టాలు, తదితర అంశాలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హేమలత, కేఆర్‌సీసీ ప్రత్యేక ఉపకలెక్టర్ పి. ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎస్. సుధారాణి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

వచ్చిన అర్జీల్లో కొన్ని..

- బాలగుడబ లంకెల చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షుడు పి. అప్పారావు ఫిర్యాదు చేశారు.
- కురుపాం మండలం లండగొల్లిగూడ గ్రామంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఎక్కువగా ఉన్నందున గ్రామానికి మినీ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని చేయాలని బి. ఇందిరమ్మ, తదితరులు వినతిపత్రం అందజేశారు.
- గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడి, వండిడి గ్రామాలకు ఆశా కార్యకర్తల పోస్టులు కేటాయించి, భర్తీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.
- జియ్యమ్మవలస మండలం తురకనాయుడువలస గ్రామానికి చెందిన ఎ. సూరమ్మ వందశాతం అంగవైకల్యంతో బాధపడుతున్నానని, పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేసింది.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన కోటపర్తి లక్ష్మణరావు


లారీ కింద చిక్కుకున్న మెరుగు బాలాజీ

గజపతినగరం: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్ (మెంటాడ జంక్షన్) వద్ద లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలియజేసిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా మధురవాడకు చెందిన మెరుగు బాలాజీ (25), అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ మూలవలస గ్రామానికి చెందిన కోటపర్తి లక్ష్మణరావు ద్విచక్ర వాహనంపై మధురవాడ నుంచి అనంతగిరి మండలం మూలవలసకు బయలుదేరారు. సరిగ్గా గజపతినగరం మండల కేంద్రంలోని నాలుగురోడ్ల జంక్షన్ వద్దకు వచ్చేసరికి విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్ వెళ్తున్న బొగ్గు లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న కోటపర్తి లక్ష్మణరావు అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న బాలాజీ లారీ చక్రం కింద ఇరుక్కుపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడ్ని స్థానికులు గజపతనగరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ చోటేలాల్ (మధ్యప్రదేశ్)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడు, క్షతగాత్రుడు మధురవాడలో ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఒకరు..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తవలస: మండలంలోని విజయనగరం – కొత్తవలస రోడ్డులో కంటకాపల్లి గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 40 సంవత్సరాలు) మృతి చెందాడు. మృతుడు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వాడై .. సమీపంలోని శారదా కర్మాగారంలో పని చేసేందుకు వచ్చి ఉండవచ్చని సీఐ షణ్ముఖరావు అభిప్రాయపడ్డారు. మృతుడిని గుర్తించేందుకు ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. గ్రామ రెవెన్యూ కార్యదర్శి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సిమెంట్ పోల్ ఢీకొని మరొకరు..


తలగాపు రమేష్ మృతదేహం

కొమరాడ: మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న తలగాపు రమేష్ (41) సోమవారం జరిగి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్సై కె. నీలకంఠం తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. తలగాపు రమేష్ మండలంలోని కుమ్మరిగుంటకు చెందిన వాడు కాగా.. తాపీమేస్త్రిగా పనిచేస్తూ ఇందిరానగర్‌లో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం పని పూర్తి చేసుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా.. తులసివలస సమీపంలో రోడ్డుపక్కనున్న సిమెంట్ పోల్‌కు గుద్దుకుని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి వెంటనే అతడ్ని కురుపాం ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సుమ, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి యావజ్జీవ జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2021లో నమోదైన పోక్సో కేసులో ఏలేశ్వరంనకు చెందిన నిందితుడు శివకుమార్ (29)కు యావజ్జీవ శిక్ష విధిస్తూ విజయనగరం జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి నాగమణి తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. సోమవారం ఆయన తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరంలో ఉంటున్న 16 ఏళ్ల బాలికతో తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరంలో చైతన్యనగర్‌కు చెందిన శివకుమార్ పరిచయం పెంచుకున్నాడు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్స్ చేస్తున్నట్లు సదరు బాలికతో అబద్ధాలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి, శారీరకంగా దగ్గరయ్యాడు. ఈ క్రమంలో బాధితురాలు గర్భం దాల్చి ఓ బాబుకు జన్మనిచ్చింది. ఈ సమయంలో తనను పెళ్లి చేసుకోవాలని బాధితురాలు కోరగా.. శివకుమార్ కులం పేరుతో దూషించాడు. దీంతో బాధితురాలు విజయనగరం వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి సీఐ మురళి కేసు నమోదు చేసి దిశ పీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. అప్పటి దిశ డీఎస్పీ త్రినాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ జైలుశిక్షతో పాటు రూ. 13 వేల జరిమాన విధించారు.

డీసీసీబీ చైర్మన్‌గా కిమిడి

- ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేసిన నాగార్జున
- ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పి డీసీసీబీ చైర్మన్‌తో సరిబెట్టిన అధిష్టానం


కిమిడి నాగార్జున

చీపురుపల్లి: టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునను డీసీసీబీ చైర్మన్‌గా నియమిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పది జిల్లాలకు డీసీసీబీ చైర్మన్లను నియమించారు. ఈ క్రమంలో విజయనగరం జిల్లా పదవి నాగార్జునను వరించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాగార్జునకు ఎమ్మెల్సీ పదవి వస్తుందని ఆయన అనుచరవర్గం ఎదురుచూసింది. కానీ ఎమ్మెల్సీ పదవి లేదు సరికదా కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లోనూ ఆయన పేరు కనిపించలేదు. దీంతో ఏడాది కాలంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పార్టీకి సేవలు అందిస్తూ వస్తున్నారు. చివరకు డీసీసీబీ చైర్మన్ పదవిని కట్టబెట్టి నాగార్జునతో పాటు ఆయన అనుచరవర్గాన్ని అధిష్టానం చల్లబరిచే ప్రయత్నం చేస్తోందనే చర్చ నడుస్తోంది. 2016లో అమెరికా నుంచి వచ్చిన నాగార్జున టీడీపీలో యాక్టివ్‌గా ఉంటూ 2019 ఎన్నికల్లో చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఓటమి చెందినప్పటికీ తిరిగి అమెరికా వెళ్లకుండా నియోజకవర్గంలోనే ఉంటూ పార్టీ బలోపేతానికి కోసం కృషి చేశారు. 2024 ఎన్నికల్లో ఆయనే ఎమ్మెల్యే అభ్యర్థి అని క్యాడర్ అంతా చెప్పుకున్నారు. కానీ పార్టీ అధిష్టానం మాత్రం ఆయన పెదనాన్న కిమిడి కళా వెంకటరావుకు టిక్కెట్ ఖరారు చేసింది. ఆ సమయంలో తీవ్ర మనస్తాపానికి గురైన నాగార్జున కొద్ది రోజులు పార్టీకి దూరంగా ఉన్నప్పటికీ.. తర్వాత పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు. ఇదిలా ఉంటే నాగార్జునకు ఎమ్మెల్సీ రాకుండా సొంత మనుషులే అడ్డుకున్నారన్న ప్రచారం కూడా ఉంది. మొత్తంమ్మీద నాగార్జునకు డీసీసీబీ చైర్మన్ పదవి ఖరారవ్వడంతో ఆయన నివాసం వద్ద అనుచర వర్గం బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹132	₹234	₹244